క్లుప్తంగా

నేడు డయల్ యువర్ కమిషనర్

తిరుపతి తుడా: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సోమవారం ఉదయం 9:30 నుంచి 10:30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ప్రజలు తమ సమస్యలను 0877–2227208కు కాల్ చేసి తెలియజేయవచ్చు. అలాగే 10:30 నుంచి 12 గంటల వరకు ప్రజలు తమ సమస్యలను నేరుగా కమిషనర్‌కు అందజేయవచ్చు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని ఆదివారం సినీ డైరెక్టర్ సురేష్‌బాబు, ఎమ్మెల్సీ భరత్ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తిరుపతి రూరల్: తిరుపతి నగరంలోని భవానీనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో లైన్ల మరమ్మతులు, గంగమ్మ గుడి పరిసర ప్రాంతాల్లో రోడ్డు విస్తరణ పనుల కారణంగా సోమ, మంగళవారాల్లో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఎస్పీడీసీఎల్ తిరుపతి డివిజన్ ఈఈ వాసుదేవరెడ్డి తెలిపారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పీకే లేఔట్, గంగమ్మ గుడి, తుడా కార్యాలయం, హెడ్ పోస్ట్ ఆఫీస్, రిజిస్ట్రేషన్ కార్యాలయం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎమ్మెల్యే పెళ్లి కానుక పంపిణీ



పాకాల : దామలచెరువు పంచాయతీ మక్కాన్ వీధికి చెందిన నూతన వధూవరులు సుభాన్, తాయిఫాకు చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పెళ్లి కానుక పంపించారు. వాటిని ఆదివారం ఉపసర్పంచ్ ఎస్‌ఏ.ఇమ్రాన్, వైస్ ఎంపీపీ నాగూర్‌బీ, కో–ఆప్షన్ మెంబర్ ఖాజామస్తాన్ అందజేశారు.

పేదలకు రంజాన్ తోఫా..



తిరుపతి కల్చరల్: ఉయ్ సపోర్టు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు తహసున్నీషా బేగం ఆధ్వర్యంలో ఆదివారం పేదల ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. అలాగే 20 మంది వికలాంగులు, మరో 20 మంది ఎస్టీ కాలనీ ప్రజలకు రంజాన్ తోఫాను అందజేశా రు. నరేంద్రనాథ్, సుబ్రమణ్యం, చంద్రశేఖర్, మాధవ్, శ్రీలత, లక్ష్మీ, సంధ్య, సుజాత, కవిత పాల్గొన్నారు.

భక్తులకు మజ్జిగ..



తిరుపతి కల్చరల్: అక్షయ తృతీయ, సింహాద్రి అప్పన్న స్వామి నిజరూప దర్శనం ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం రాయలసీమ రంగస్థలి సభ్యులు గోవిందరాజస్వామి ఆలయం సమీపంలో భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి, సభ్యులు గుణకల మురళి, వినోద్, దిలీప్, సుబ్రమణ్యంరెడ్డి, రాజశేఖర్, చంద్రారెడ్డి, రామిరెడ్డి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

అలరించిన దుర్యోధన వధ



భాకరాపేట : స్థానిక మహా భారత ప్రాంగణంలో నిర్వహిస్తున్న మహాభారత ఉత్సవాల్లో చివరి ఘట్టమైన దుర్యోధన వధ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా దుర్యోధన విగ్రహాన్ని బంక మట్టితో తీర్చిదిద్దారు. దుర్యోధనుడు, భీముడి వేషధారులు యుద్ధం చేసే ఘట్టాన్ని రక్తి కట్టించారు. బంక మట్టి కోసం భక్తులు పోటీ పడడంతో తొక్కిసలాట జరిగింది.

సెక్యూరిటీ యాజమాన్యాల సమస్యలపై పోరాటం

తిరుపతి కల్చరల్: రాష్ట్రంలోని ఏపీ ప్రైవేట్ సెక్యూరిటీ యాజమాన్యాల సమస్యలపై నిరంతర పోరాటాలు చేపడతామని ఏపీపీఎస్‌ఎంఏ రాష్ట్ర అధ్యక్ష, ఉపాధ్యక్షులు విశ్వనాథం, ఎస్.గోపాల్ తెలిపారు. కేటీ రోడ్డులోని బాలాజీ యూఫోరియా కలర్స్ జిమ్ మిద్దపైన ఉన్న సమావేశ మందిరంలో ఆదివారం ప్రైవేటు సెక్యూరిటీ యాజమాన్యాల సంఘం రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించారు. సెక్యూరిటీ గార్డ్స్ డ్యూటీల్లో పడుతున్న కష్టాలు, పనివేళలపై చర్చించారు. ఈఎస్‌ఐ, పీఎఫ్‌లపై యాజమాన్యాలు పడుతున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు చంద్రశేఖర్ నాయుడు, శ్యామ్ రమేష్, రాము, బాలాజీ, రామ్ సుందర్, రవీంద్రబాబు, వెంకట్రావు, వెంకటేశ్వర్లు తదితరుల పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు చేయూత

- సొంత డబ్బు చెల్లించిన ఎమ్మెల్యే చెవిరెడ్డి
- రుణపడి ఉంటామంటున్న వ్యాపారులు
- కూరగాయల రేట్లు తగ్గించి అమ్ముతున్నారంటున్న ప్రజలు



సంతలో అన్నదానం చేస్తున్న నేతలు



చంద్రగిరి సంతలో వ్యాపారం చేసుకుంటున్న రైతులు, వ్యాపారులు

చంద్రగిరి(తిరుపతి రూరల్): ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను విక్రయించుకోవడానికి సంతలకు వచ్చే రైతులు, చిరువ్యాపారులు గేట్ రుసుం చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని గమనించిన ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వారికి చేయూత ఇవ్వాలని భావించారు. తన సొంత డబ్బును పంచాయతీకి చెల్లించి పంటలను ఉచితంగా అమ్ముకునే వెసులుబాటు కల్పించారు. దీంతో రైతులు, వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చెవిరెడ్డికి రుణపడి ఉంటామని తెలుపుతున్నారు. చంద్రగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోని చంద్రగిరి, పాకాల, దామలచెరువు, భాకరాపేట, చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం, బోడేవాండ్లపల్లి, నెరబైలు, నెత్తకుప్పం తదితర గ్రామాల్లో వారపు సంతలు జరుగుతున్నాయి. ఏప్రిల్ 1 నుంచి ఏడాది పాటు వారపు సంత, దినసరి కూరగాయల మార్కెట్, జంతు వధశాల, ప్రైవేట్ బస్టాండ్ ఇలా ఎన్నో రకాల పన్నులతో పంచాయతీ అధికారులు వేలంపాటలు నిర్వహిస్తున్నారు. టెండర్ దక్కించుకున్న వారు వ్యాపారులు, రైతులు, వాహనదారుల నుంచి రుసుములు వసూలు చేస్తున్నారు. వచ్చే అరకొర ఆదాయంలో ఎక్కువ శాతం రుసుం చెల్లించేందుకు వెచ్చిస్తుండడంతో రైతులు, వ్యాపారులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని గమనించిన ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చంద్రగిరి నియోజకవర్గంలోని గ్రామాల్లో జరిగే అన్ని సంతలు, మార్కెట్ల వేలంను దాదాపు రూ.కోటి వరకు చెల్లించి అందరూ ఉచితంగా విక్రయాలు చేసుకునేలా చర్యలు తీసుకున్నారు. దీంతో వ్యాపారులు, రైతులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చెవిరెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామని వెల్లడిస్తున్నారు. రానున్న రోజుల్లోనూ చెవిరెడ్డి సేవలను గుర్తుపెట్టుకుంటామని మహిళలు తెలుపుతున్నారు.

రుణపడి ఉంటాం



నేను ఆదివారం నుంచి శనివారం వరకు వివిధ సంతల్లో నిత్యావసర సరుకులు అమ్ముతున్నాను. ప్రతిరోజూ గేటు రూపంలో రూ.300 నుంచి రూ.500 వరకు చెల్లిస్తున్నాను. ఇప్పుడు వారం రోజులు సంతల్లో నేను అమ్ముతున్న వస్తువులకు ఎలాంటి గేటు రుసుం లేకపోవడం సంతోషకరం. గేటు రుసుం లేకుండా చేసిన ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి రుణపడి ఉంటాం. – బాలాజీ, వ్యాపారి, పాకాల

చెవిరెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలి



ఎన్నికల్లో గెలిచామా.. నాలుగు మాటలు చెప్పామా.. ఏదో సంపాదించుకున్నామా అన్నదే ఈ రోజు రాజకీయం. మా ఎమ్మెల్యే పదేళ్లుగా నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి కష్టం వచ్చినా అండగా నిలుస్తున్నారు. వ్యాపారులు, రైతులు ఈ రోజు స్వేచ్ఛగా ఎలాంటి గేటు రుసుం చెల్లించకుండా సంతలో అమ్ముకుంటున్నారంటే అది చెవిరెడ్డి చలవే. ప్రజాప్రతినిధులు చెవిరెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలి.

– అరుణ, వ్యాపారి, చంద్రగిరి

వారానికి రూ.వెయ్యి మిగులుతుంది



నేను ప్రతి ఆదివారం వాహనంలో ఎర్రగడ్డలు తీసుకొచ్చి అమ్ముతున్నాను. సంతలో గేటు రుసుం కింద రూ.1000 వసూలు చేసేవారు. ప్రస్తుతం ఆదివారం రూ.వెయ్యి మిగులుతోంది. అన్ని సంతల్లోనూ ఎమ్మెల్యే చెవిరెడ్డి సొంత నిధులు వెచ్చించి గేటును ఉచితం చేయడంతో వారానికి రూ.6000 దాకా మిగులుతోంది. అలాగే అన్నదానం కూడా చేస్తున్నారు. ఎమ్మెల్యేకు జీవితాంతం రుణపడి ఉంటాను.

– గోపి, వ్యాపారి, కల్లూరు

ఫిష్ ఆంధ్ర చేపల విక్రయ కేంద్రం ప్రారంభం



ఫిష్ ఆంధ్ర చేపల విక్రయ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం : తిరుపతి – జీవకోన రోడ్డులో ఏర్పాటు చేసిన ఫిష్ ఆంధ్ర చేపల విక్రయ దుకాణాన్ని ఆదివారం ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మత్స్యశాఖ సహకారంతో తిరుపతిలో ఫిష్ ఆంధ్ర చేపల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అందులో భాగంగా జీవకోన రోడ్డులోని అమెరికన్ బార్ ఎదురుగా చెన్నకేశవులు అనే వ్యక్తి ఏర్పాటు చేసిన ఫిష్ ఆంధ్ర చేపల విక్రయ కేంద్రాన్ని ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు స్వచ్ఛమైన చేపలను అందించేందుకు ప్రభుత్వం సరికొత్త నిర్ణయం తీసుకుందని తెలిపారు. విక్రయదారులు దుకాణాన్ని ఏర్పాటు చేసుకుంటే మత్స్యశాఖ అధికారులు స్వచ్ఛమైన లైవ్ చేపలను సరఫరా చేస్తారని తెలిపారు. ఐస్ చేపలు తిని అనారోగ్యానికి గురికాకుండా ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం, ఆరోగ్యం పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సేవాదళ్ రీజనల్ కో–ఆర్డినేటర్ తలారి రాజేంద్ర, నాయకులు సురేంద్రరెడ్డి, రెడ్డెప్ప, బాలకృష్ణ, మురళి, కోటి ముద్రరాజ్ పాల్గొన్నారు.

సత్యనారాయణపురం నుంచి మాస్టర్ ప్లాన్ రోడ్డు!



రోడ్డు ఏర్పాటుకు పరిశీలన చేస్తున్న డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం : డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి ఆలోచనలతో తిరుపతి ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తీరుతున్నాయి. మాస్టర్ ప్లాన్ రోడ్లను ఏర్పాటుచేస్తూ నగర అభివృద్ధికి బాటలు వేస్తున్నారు. ఈ క్రమంలోనే జీవకోన రోడ్డులోని సత్యనారాయణపురం నుంచి మాస్టర్ ప్లాన్ రోడ్డు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇక్కడ ట్రాఫిక్ సమస్యతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను పరిష్కరించాలని 30 ఏళ్లుగా అధికారులు, పాలకులను కోరుతున్నా పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో స్థానికుల వినతి మేరకు భూమన అభినయ్‌రెడ్డి ఆదివారం సత్యనారాయణపురం సర్కిల్ నుంచి తిరుమల బైపాస్ రోడ్డులోకి మాస్టర్ ప్లాన్ రోడ్డు ఏర్పాటు చేయడంపై సాధ్యాసాధ్యాలను పరిశీలించారు. ఈ రోడ్డుతో జీవకోన ప్రజల ట్రాఫిక్ కష్టాలు తీరుతాయని అభినయ్‌రెడ్డి తెలిపారు. తిరుపతిలో ట్రాఫిక్ సమస్యలే లేకుండా చేయడమే తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

డివైడర్, విద్యుత్ లైట్లు ఏర్పాటుకు చర్యలు

జీవకోన రోడ్డులోని ఉన్నత పాఠశాల వద్ద నుంచి జీవలింగేశ్వర ఆలయం వరకు డివైడర్‌తోపాటు లైట్లు ఏర్పాటు చేయనున్నట్లు భూమన అభినయ్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అనీష్ కుమార్‌రాయల్, వైఎస్సార్‌సీపీ సేవాదళ్ రీజనల్ కో–ఆర్డినేటర్ తలారి రాజేంద్ర, నాయకులు సురేంద్రరెడ్డి, చింతల చేను గోపి, రెడ్డెప్ప, కోటి ముద్రరాజ్, పుష్పాచౌదరి, శారద, సరస్వతమ్మ పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి కల్చరల్: జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. తిరుపతిలోని ఒక ప్రైవేటు కల్యాణ మండపంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ తిరుపతి జిల్లా మహాసభ నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో విలువలతో కూడిన జర్నలిస్టులు ఎందరో ఉన్నారని తెలిపారు. వారి జీవితాలు సక్రమంగా సాగడం లేదన్నారు. వారి సమస్యల గురించి తనకు పూర్తి అవగాహన ఉందన్నారు. ఏ వార్త కారణంగా ఎటువంటి లాభనష్టాలు ఉంటాయో ఒక్క రాజకీయ పార్టీలకే ఎరుక అని గుర్తు చేశారు. ఈ విషయంలో తనకు రాజకీయ గురువు ఆదర్శమూర్తి స్వర్గీయ వైఎస్.రాజశేఖరరెడ్డి నుంచి చాలా విషయాలు నేర్చుకున్నానని పేర్కొన్నారు. రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు తదితర సమస్యల పరిష్కారంలో తాను ముందుంటానని తెలిపారు. ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఢిల్లీబాబు రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులు స్వేచ్ఛగా వార్తలు రాసే పరిస్థితులు లేవని తెలిపారు. అనంతరం ఐజేయూ జాతీయ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, జాతీయ సభ్యులు సీబీ.మోహన్‌రావు, రాజేశ్వరరావు, ఏపీఎంఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఐవీ.రామరాజు జిల్లా అధ్యక్షుడు కోలా లక్ష్మీపతి ప్రసంగించారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

పాకాల : ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని బీటీఏ నాయకులు కోరారు. స్థానిక ఎస్వీఎస్ పాఠశాల ఆవరణలో ఆదివారం బీటీఏ మండల అధ్యక్షుడు జ్యోతిప్రసాద్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఆ సంఘం రాష్ట్ర సలహాదారు ఆంజనేయులు, జిల్లా అధ్యక్షుడు రామచంద్రయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్మూర్తి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ బకాయి డీఏలు విడుదల చేయాలన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత ఓపీఎస్‌ను అమలు చేయాలన్నారు. విజయమోహన్, కృష్ణమూర్తి, జయబాల, రాజేంద్రుడు, వెంకటయ్య, గోపాలయ్య, తులసీరామ్ పాల్గొన్నారు.

వినాయకుని సేవలో కలెక్టర్



కలెక్టర్‌కు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఏఈఓ రవీంద్రబాబు

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామిని కలెక్టర్ వెంకటరమణారెడ్డి దర్శించుకున్నారు. ఉదయం ఆయన స్వామివారి దర్శనార్థం కుటుంబసమేతంగా కాణిపాకం విచ్చేయగా ఆలయ ఏఈఓ రవీంద్రబాబు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులచే ఆశీర్వచనం అందించి స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ శ్రీనివాస్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక శిబిరం



దుర్గసముద్రంలో పారిశుద్ధ్యంపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

తిరుపతి రూరల్: పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్–15 ఆధ్వర్యంలో వారం రోజులుగా తిరుపతి రూరల్ మండలం దుర్గసముద్రంలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరం ఆదివారం ముగిసింది. ముగింపు సమావేశంలో సర్పంచ్ ప్రసాద్‌రెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ కో –ఆర్డినేటర్ ఆచార్య కాత్యాయని, ఈసీఈ కో–ఆర్డినేటర్ మాధవి, ప్రోగ్రామ్ అధికారిణి యువశ్రీ పాల్గొన్నారు. విద్యార్థులు వారం రోజుల పాటు గ్రామంలో పలు అభివృద్ధి, పారిశుధ్య పనులు చేపట్టడం అభినందనీయమని సర్పంచ్ ప్రసాద్‌రెడ్డి కొనియాడారు. గ్రామాభివృద్ధికి తోడ్పడేలా ఎలక్ట్రానిక్ పరికరాన్ని తయారుచేయాలని ఈసీఈ విద్యార్థులకు సూచించారు. ఈ శిబిరంలో చురుగ్గా పాల్గొన్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, గ్రామ సచివాలయం వలంటీర్లకు అభినందనలు తెలుపుతూ సర్టిఫికెట్లు అందజేశారు. అంతకుముందు పారిశుద్ధ్యంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

బ్రాహ్మణపట్టులో గాలీవాన బీభత్సం



బాధితులను పరామర్శిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: మండలంలోని బ్రాహ్మణపట్టు పంచాయతీ ఈడిగపల్లిలో ఆదివారం రాత్రి గాలీవాన బీభత్సం సృష్టించింది. గాలులకు ఏడు ఇళ్లు దెబ్బతిన్నాయి. ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఇళ్లలోని నిత్యావసర సరుకులు పనికిరాకుండా పోయాయి. సమాచారం అందుకున్న వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అక్కడికి చేరుకుని బాధితులను పరామర్శించారు. తక్షణ సాయం కింద గాయపడిన వారికి రూ.10 వేలు, ఇళ్లు దెబ్బతిన్న వారికి రూ.5 వేల చొప్పున అందజేశారు. వారికి వేమూరు ప్రభుత్వ పాఠశాలలో పునరావాసం కల్పించారు. బాధితులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సర్పంచ్ సుబ్రమణ్యంరెడ్డి, ఎంపీటీసీ యోగానందరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు హేమాద్రిరెడ్డి, నాయకులకు సూచించారు. నేలకూలిన ఇళ్లను బాగు చేయించి ఆదుకుంటామని భరోసా కల్పించారు. ఆపదలో ఆదుకున్న మోహిత్ రెడ్డికి గ్రామస్తుల కృతజ్ఞతలు తెలిపారు.

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు

రామచంద్రాపురం: మండలంలోని రాయలచెరువుపేటలో వెలసిన ముత్యాలమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏకవీర ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రతాప్ స్వామీజీ ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. ఈ క్రమంలోనే పెద్ద ముత్యాలమ్మ నూతన శిలకు ప్రాణప్రతిష్ట చేశారు.

ఎమ్మెల్యే భూమనకు కృతజ్ఞతలు



ముస్లిం జేఏసీ చైర్మన్ ముత్తూజా

తిరుపతి కల్చరల్: ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి చొరవతో కార్పొరేషన్ అధికారులు ఎస్వీయూ ఈద్గా మైదానంలో రంజాన్ పండుగకు ఏర్పాట్లు బాగా చేశారని ముస్లిం జేఏసీ చైర్మన్ ముత్తూజా ఒక ప్రకటనలో కొనియాడారు. ప్రార్థనల సందర్భంగా ముస్లింలు ఇబ్బంది పడకుండా పెండ్యాలు, తాగునీటి సౌకర్యం, కూలర్స్ ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. సౌకార్యాలు కల్పించిన ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, కార్పొరేషన్ కమిషనర్ హరిత, పోలీసు అధికారులకు ముస్లింల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వాకర్స్‌కు ఉచిత దంత వైద్య పరీక్షలు

తిరుపతి కల్చరల్: వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 302 గవర్నర్ రెడ్డివారి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. కాకర్ల డెంటల్ ఆసుపత్రి అధినేత డాక్టర్ సుబ్బరాజు సౌజన్యంతో వాకర్స్ సభ్యులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

నేడు ఉచిత వైద్య పరీక్షలు

తిరుపతి అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం ఉద్యోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్టు కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. పేదలకు ఉచితంగా వైద్యం అందించాలనే ఉద్దేశంతో తుడా చైర్మన్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని వెల్లడించారు. సుమారు రూ.3 వేల విలువైన రక్త పరీక్షలు, ఈసీజీ ఉచితంగా చేపడతారని పేర్కొన్నారు. వైద్య పరీక్షలు చేసుకునే వారు ఆధార్ కార్డు తీసుకురావాలని తెలిపారు.